నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శనివారం 22 ఫిబ్రవరి 2025 | SURYAPET

ఎంపీఓలకు షోకాజ్ నోటీసులు

- మార్చి 31లోపు ఇంటి పన్నులు చెల్లించాలని డీపీఓ ఆదేశాలు
- జిల్లాలో రూ.25కోట్ల గానూ రూ.16కోట్ల పన్నులు వసూలు

నల్లగొండ, ఫిబ్రవరి 21 : గ్రామపంచాయతీలకు పైసా విదల్చని ప్రభుత్వం పన్నులు వసూలు చేసి అవసరాలు తీర్చుకోవాలని అధికారులకు టార్గెట్ పెట్టడంతో పంచాయతీరాజ్ యంత్రాంగం పన్నుల వసూళ్లపై దృష్టి సారించింది. ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతుండడంతో మార్చి 31లోపు పూర్తి స్థాయిలో పన్నులు వసూలు చేయాలనే లక్ష్యంలో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య 12 మంది మండల పంచాయతీ అధికారులకు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నకిరేకల్, కొండమల్లేపల్లి, కట్టంగూర్, దేవరకొండ, గుర్రంపోడ్, నేరేడుగొమ్ము, శాలిగౌరారం, నార్కట్‌పల్లి, చండూరు, కేతేపల్లి, చందంపేట, అనుముల మండలాల్లోని 355 గ్రామాల్లో 30శాతం మాత్రమే ఇంటి పన్నులు వసూలు అయ్యాయి. దాంతో ఆయా మండల పంచాయతీ అధికారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. పన్ను వసూళ్లలో నిర్లక్ష్యంపై మూడ్రోజుల్లో వివరణ ఇవ్వాలని, మార్చి 31లోపు పూర్తి స్తాయిలో పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో రూ.24.94కోట్ల పన్నులకు గానూ ఇప్పటి వరకు 16.25కోట్లు వసూలు అయ్యాయి.

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి బొడ్రాయి పునఃప్రతిష్ఠ ఆహ్వానం

నాగారం, ఫిబ్రవరి 21 : నాగారం మండలం శాంతినగర్ గ్రామంలో మార్చి 23, 24 తేదీల్లో జరిగే బొడ్రాయి పునఃప్రతిష్ఠ, ముత్యాలమ్మ పండుగకు హాజరుకావాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్ కుమార్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. శుక్రవారం నేరుగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. పండుగను రాగద్వేషాలు లేకుండా పార్టీలకతీతంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఈ సందర్భంగా సూచించారు.

కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షేక్ నాగుల్ మీరా, చారి, పొదిల లింగయ్య, సయ్యద్, మల్లెపాక సత్యనారాయణ, హన్మంతు, ఉప సర్పంచ్ శ్రీను, చిప్పలపల్లి చిరంజీవి పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, పక్కన బీఆర్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

జల దోపిడీపై నోరు మెదుపరా?

కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తున్నా పట్టించుకోరా..?

- చంద్రబాబు తొత్తుగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కు పట్టని రైతుల బాధలు
- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : కృష్ణా నీటిలో తెలంగాణకు రావాల్సిన వాటాను సైతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరలించుకుపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నదని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి మండిపడ్డారు. ఈ జల దోపిడీపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.భువనగిరి పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తొత్తుగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు తాగు, సాగు నీటికి ఇబ్బందులు తలెత్తుతున్నా కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. నీటి పారుదల శాఖ మంత్రిగా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నా నీటి బాధలు తప్పడం లేదన్నారు. పరిస్థితి ఇలానే ఉంటే రానున్న రోజుల్లో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి మన వాటాను మనం వాడుకునే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. 2002 సంవత్సరంలో వేల ట్రాక్టర్లతో రైతులంతా కృష్ణా బ్యారేజ్‌పై నిరసన వ్యక్తం చేశారని, ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి వస్తే బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన ఏ విధమైన పోరాటానికైనా సిద్ధంగా ఉందని హెచ్చరించారు.

ఎమ్మెల్యే కుంభం మొద్దు నిద్ర వీడాలి

భువనగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నారని, ఆయన మొద్దు నిద్ర వీడి జనానికి మేలు చేయాలని సునీతామహేందర్ రెడ్డి అన్నారు. బస్వాపురం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారని చెప్పారు. 11 టీఎంసీల నీటిని నింపుకోవడానికి సిద్ధంగా ఉన్నా రూ.109 కోట్లను కూడా విడుదల చేయించుకోలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద తిమ్మాపూర్ గ్రామ నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తే మన ప్రాంతం గోదావరి నీటితో సస్యశ్యామలం అవుతుందని వివరించారు. ఇందు గాను రూ. 50 కోట్లు కలెక్టర్ అకౌంట్లో ఉన్నాయని, మిగిలిన రూ.60 కోట్లు విడుదల చేయించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ భువనగిరి మండల అధ్యక్షుడు జనగాం పాండు, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బీరు మల్లయ్య, పెంట నరసింహ కాజా ఆజిముద్దీన్, బబ్లు వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌తో పొలానికి నీళ్లు పెడుతున్న రైతు వెంకన్న

పంటను కాపాడుకునేందుకు నీటి పాట్లు

ట్యాంకర్‌తో నీళ్లు పోస్తున్న రైతు

చిట్యాల, ఫిబ్రవరి 21 : సాగునీటి వసతి లేక, భూగర్భ జలం జాడ లేక చేతికి వచ్చే దశలో పంటలు ఎండిపోతున్నాయి. చిట్యాల మండలంలో రైతులు 13,600 ఎకరాల్లో వరి సాగు చేయగా, 15శాతానికి పైగా ఎండిపోయినట్లు అధికారిక లెక్కలే చెప్తున్నాయి. చిట్యాల, చిన్నకాపర్తి, పెద్దకాపర్తి, వనిపాకల, వట్టిమర్తి ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. పొట్టకొచ్చిన దశలో నీళ్లు లేక ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. పెద్దకాపర్తికి చెందిన రైతు ఈరటి వెంకన్న పదెకరాల్లో వరి వేయగా, రెండెకరాలకుపైగా ఎండిపోయింది. మిగిలిన పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్‌లో నీళ్లు తెచ్చి పొలానికి పెడుతున్నాడు.

రాష్ట్రాన్ని ఎడారి చేసే కుట్ర

కళ్లున్న కబోధిలా కాంగ్రెస్ పాలన

- కృష్ణా నీటిని ఆంధ్రాకు అక్రమంగా తరలిస్తున్నా పట్టింపు లేని పాలకులు
- తెలంగాణను ఎడారిలా మార్చేందుకు కాంగ్రెస్ కంకణం
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సారథ్యంలో సూర్యాపేట జిల్లా నుంచి జల పోరాటం
- మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ నేతలు

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 21 : కృష్ణా నీటిని అక్రమంగా ఆంధ్రాకు తరలిస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు కళ్లున్న కబోధిలా వ్యవహరిస్తున్నారని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ విమర్శించారు. శుక్రవారం సూర్యాపేటలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్‌కు వెయ్యి టీఎంసీల నీరు వస్తే అందులో 60 శాతం ఆంధ్రా, 40 శాతం తెలంగాణ వాడుకోవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 10 వేల క్యూసెక్కుల నీటిని దొంగతనంగా ఆంధ్రాకు తరలించారని మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వం తమ వాటా నీటినే కాకుండా అదనంగా తరలించుకుపోతున్నా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నోరు మెదపకపోవడం దౌర్భాగ్యమన్నారు. కృష్ణా జలాలను ఏపీకి అక్రమంగా తరలిస్తున్నారని, ఈ విషయంలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)ని ప్రశ్నించి ఢిల్లీలో ధర్నా చేస్తామని బీఆర్ఎస్ నాయకుడు హరీశ్‌రావు హెచ్చరించిన తర్వాత కాంగ్రెస్ నాయకులు కృష్ణా జలాలపై మాట్లాడడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎంపీలు ఉన్నారని, అందులో బండి సంజయ్, కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రులుగా ఉన్నప్పటికీ ఈ విషయమై స్పందించకపోవడం అన్యాయమన్నారు. తెలంగాణ వాటా ప్రకారం కృష్ణా జలాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ హయాంలో రెండు పంటలకు నీళ్లు..

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏడాదికి రెండు పంటలకు నీళ్లిచ్చామని బడుగుల గుర్తుచేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో లిఫ్ట్‌ల ద్వారా లక్ష ఎకరాలకు, నాగార్జున సాగర్ ద్వారా 4.50 లక్షల ఎకరాలకు, ఎస్ఎల్‌బీసీ ద్వారా రెండున్నర లక్షల ఎకరాలకు నీళ్లిచ్చామని తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు సన్నాయి నొక్కులకు, మాయమాటలకు రేవంత్‌రెడ్డి లొంగిపోయి తెలంగాణను ఎడారిలా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సూర్యాపేట, నల్లగొండ, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రజలు తాగునీటికి కూడా ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. శ్రీశైలం వద్ద ఆంధ్రా బలగాలు ఉంటే నాగార్జునసాగర్ దగ్గర కేంద్ర బలగాలను పెట్టడం ఏంటని ప్రశ్నించారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సారథ్యంలో సూర్యాపేట జిల్లా నుంచి జల పోరాటం మొదలవుతుందని పేర్కొన్నారు. కృష్ణా జలాల అక్రమ తరలింపుపై ఢిల్లీకి వెళ్లి కేఆర్ఎంబీని ప్రశ్నించేందుకు తాము సిద్ధమని, మీరు వస్తే కలిసి పోరాడుదామని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. కాగా, ఎస్సారెస్పీ రెండోదశ ద్వారా ఆరేండ్లు నీళ్లిచ్చామని, ప్రస్తుతం నీళ్లు ఇవ్వకపోవడంతో తుంగతుర్తి, సూర్యాపేట, మునగాల ప్రాంతాల్లో పంటలు ఎండుతున్నాయన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, ఆత్మకూర్.ఎస్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తూడి నర్సింహారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సామేల్‌కు అసమ్మతి సెగ

- మండల, గ్రామ కమిటీలకు తెలియకుండా పర్యటించడం ఏంటి?
- సదర్శాపురంలో నిలదీసిన కాంగ్రెస్ నేతలు

మోత్కూరు మండలంలోని సదర్శాపురంలో ఎమ్మెల్యే సామేల్‌తో వాగ్వాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ తీగల నర్సింహారెడ్డి

మోత్కూరు, ఫిబ్రవరి 21 : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు ఆ పార్టీలోని అసమ్మతివర్గం నుంచి నిరసన సెగ తప్పడం లేదు. గెలుపు కోసం అన్ని విధాలా పని చేసిన తమను పట్టించుకోవడం లేదని, మండల, గ్రామ కమిటీలకు సమాచారం ఇవ్వకుండా గ్రామాల్లో పర్యటించడం ఏంటని ప్రశ్నించారు. మండల పరిధిలోని బిక్కేరు వాగులోకి గోదావరి జలాలు ప్రవహిస్తుండడంతో ఎమ్మెల్యే సామేల్ శుక్రవారం మండలంలోని సదర్శాపురం దగ్గర పూజలకు వచ్చారు. ఎమ్మెల్యే సామేల్ వర్గం, అసమ్మతి వర్గం స్వాగతం పలికేందుకు గ్రామ పంచాయతీ సమీపంలో వేచి ఉన్నారు. ఈ సందర్భంగా 'మీ గెలుపు కోసం అన్ని విధాలా పని చేసిన మమ్మల్ని కాదని ఇటీవల పార్టీలో చేరిన వారిని ఎలా చేరదీస్తారు' అంటూ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ తీగల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు ఎమ్మెల్యే సామేల్‌ను నిలదీశారు. ఎమ్మెల్యే మాత్రం తన వర్గం వారితోనే కలిసి బిక్కేరులోని చెక్ డ్యామ్ వద్దకు వెళ్లి నీటిలో పసుపు, కుంకుమ, పూలను చల్లి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా గ్రామంలో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. జిల్లా మంత్రులు, మండల ముఖ్య నాయకులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని అసమ్మతి నేతలు కింద పడేసి చింపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మోత్కూరు మండల కార్యదర్శి బాలరాజు, అడ్డగూడూరు మండలాధ్యక్షుడు జోజి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ విద్యాసాగర్, గ్రామ శాఖ అధ్యక్షుడు పల్లెర్ల భాస్కర్ పాల్గొన్నారు.

మోత్కూరు మండలం సదర్శాపురంలో జిల్లా మంత్రుల ఫొటోలు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ తొలగింపు

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్, ఆర్ఓ ఇలా త్రిపాఠి

నల్లగొండ, ఫిబ్రవరి 21 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డికి తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల అధికారి శుక్రవారం ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి పలు విషయాలను వివరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నియోజకవర్గ వ్యాప్తంగా 200 పోలింగ్ కేంద్రాలు ఉండగా నల్లగొండలో 37 ఉన్నాయని, 50 మంది చొప్పున ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను నియమించామని తెలిపారు. వారికి శిక్షణ ఇవ్వడంతోపాటు ఇన్సర్మేషన్ స్లిప్పులను 22,439 మంది ఓటర్లకు గానూ 3,358 మందికి పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ నెల 25లోపు మిగిలిన వాళ్లకు కూడా సరఫరా చేస్తామన్నారు. ఈ ఎన్నికలకు జంబో బ్యాలెట్ పేపర్ వినియోగిస్తున్నామని, నియోజకవర్గంలోని అన్ని జిల్లాల్లో బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఈ ఎన్నికల్లో 28వేల బ్యాలెట్ పేపర్లు వినియోగిస్తున్నామని తెలిపిన కలెక్టర్ ఎన్నికల నియమ నిబంధనలను అభ్యర్థులందరికీ తెలియచేసినట్లు వివరించారు. అనంతరం ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లాలో 5 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు గుర్తించామని, 13 రూట్లు ఏర్పాటు చేయటంతో పాటు 15 స్టాటికింగ్ ఫోర్స్, మూడు స్పెషల్ స్టాటికింగ్ ఫోర్స్, 29 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 41ఎంసీసీ బృందాలను తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎకరంన్నరకు రైతు భరోసా 1,012 రూపాయలే

- పాముకుంటకు చెందిన మహిళా రైతు ఆవేదన

రాజాపేట, ఫిబ్రవరి 21 : మండలంలోని పాముకుంటకు చెందిన మహిళా రైతు రంగ కళమ్మకు 1.28 ఎకరాల భూమి ఉన్నది. ఉన్న మొత్తం భూమిలో వరి సాగు చేసింది. ఈ భూమికి రైతు భరోసా రూ. 11,362 రావాల్సి ఉండగా రూ. 1,012 మాత్రమే పడ్డట్టు సెల్‌ఫోన్‌లో మెసేజ్ వచ్చింది. బ్యాంక్‌కు వెళ్లి అకౌంట్‌లో చూ డగా రూ. 1,012 పడ్డాయని, మండల వ్యవసాయ కార్యాలయానికి వెళ్లి అడుగగా మొత్తం రైతు భరోసా పడ్డట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నదని కళమ్మ తెలిపింది. ఈ విషయంపై వ్యవసాయాధికారులు చేతు లు దులుపుకున్నారని, రైతు భరోసా డబ్బుల కోసం ఎవరిని అడుగాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది.



రైతు భరోసా వెయ్యి పన్నెండు రూపాయలు పడినట్లు ప్రభుత్వ నుంచి సెల్‌ఫోన్‌లో వచ్చిన మెసేజ్

ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎన్నికపై సందిగ్ధం

- ఎన్నికపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 21: ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొన్నది. నిబంధనలు విరుద్ధంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎన్నిక జరిగినట్లు, జీఓ నంబర్ 43ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ మోటకొండూర్ మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ, బాహుపేట ఆలేరు మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు జంపాల దశరథ, కందుల శంకర్ హైకోర్టును ఆశ్రయించారు. మోత్కూరు మార్కెట్ కమిటీ పరిధిలోని చాడ రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న కాటేపల్లి ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పచ్చిమట్ల మాదార్‌గౌడ్‌కు ఆలేరు మార్కెట్ కమిటీలో వైస్ చైర్మన్ పదవిని ఎలా కట్టబెడుతారని కోర్టులో గతేడాది పిల్ దాఖలు చేశారు. జీఓ నంబర్ 43 ప్రకారం నూతనంగా ఏర్పడిన మోటకొండూర్‌కు మార్కెట్ కమిటీ ఏర్పాటు జరుగలేదు. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే, అధికారులు అనాలోచితంగా జీఓ 43ని అనుసరిస్తూ మోత్కూరు మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న వ్యక్తికి ఆలేరులో మార్కెట్ కమిటీలో వైస్ చైర్మన్ పదవిని ఎలా కట్టబెట్టారని హైకోర్టులో అభ్యంతరం వ్యక్తం చేస్తూ పిల్ వేశారు.

దీనిపై జిల్లా, ఆలేరు మార్కెట్ కమిటీ అధికారులను న్యాయస్థానం వివరణ కోరగా సరైన సమాధానం రాలేదని సమాచారం. దీంతో ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎన్నిక నిబంధనలకు విరుద్ధమేనన్న అనుమానాలకు తావిస్తున్నది. ఆయన ఎన్నికను రద్దు చేస్తూ నేడో రేపో ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది.

ముగిసిన ఆపద మిత్ర వలంటీర్లకు శిక్షణ

నల్లగొండ, ఫిబ్రవరి 21 : ఎస్‌డీఆర్ఎఫ్-ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాలో 100 మంది యువకులకు నిర్వహించిన 12రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. అటవీ, అగ్నిమాపక, వైద్య, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మత్స్య, ఇంజినీరింగ్ శాఖల అధికారులు ఉచితంగా ఆయా రంగాల్లో శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర ప్రమాదాల నేపథ్యంలో రక్షణ చర్యలకు గానూ ఆపదమిత్ర వలంటీర్లను సిద్ధం చేసినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి శుక్రవారం స్థానిక డీఆర్డీఏ కార్యాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో తెలిపారు.

శిక్షణలో భాగంగా రెండ్రోజుల పాటు 4 గ్రూపులుగా ఏర్పడి కనగల్, పర్వతగిరి, మునుగోడు, పులిపలుపులతో పాటు ఉదయ సముద్రంలో చెరువుల్లో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలో ప్రాక్టీస్ చేయించినట్లు తెలిపారు. సమావేశంలో ప్రాంతీయ శిక్షణ మేనేజర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ డీపీఎం మోహన్‌రెడ్డి, ఏపీఎం ప్రభాకర్, ట్రైనర్ విష్ణువర్ధన్, జయ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సీతారాంపురం గ్రామంలో ధర్నా చేస్తున్న రైతులు

లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి

సీతారాంపురంలో రైతుల ధర్నా

గుండాల, ఫిబ్రవరి 21 : విద్యుత్ లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం కోసం రైతులు రోడ్డెక్కారు. గుండాల మండలంలోని సీతారాంపురం గ్రామంలో త్రీఫేజ్ లోఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉంటున్నది. దాంతో తరుచూ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. దాంతో పంటలు ఎండిపోతున్నాయి. విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని విసుగెత్తిన రైతులు శుక్రవారం గ్రామ కూడలిలో ధర్నాకు దిగారు. అధికారులు స్పందించి లోఓల్టేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో రైతులు రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, మల్లేశ్, వెంకట్ రెడ్డి, నర్సిరెడ్డి, కుమార్, చెంద్రయ్య, సత్తిరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

మిర్యాలగూడ బైపాస్‌పై కంటెయినర్ బీభత్సం

- నాలుగు వాహనాలను ఢీ.. ఒకరి దుర్మరణం

మిర్యాలగూడ, ఫిబ్రవరి 21 : పట్టణంలోని నందిపాడు బైపాస్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటెయినర్ నందిపాడు బైపాస్ వద్ద వేగంగా వస్తూ శరణ్య గ్రీన్‌హోమ్స్ నుంచి అప్పుడే రోడ్డు మీదకు బైక్‌పై వస్తున్న పి.భరతయ్య(75)ను ఢీకొట్టింది. అనంతరం ముందు ఉన్న డీసీఎం, ఆటో, మరో డీసీఎంను వరుసగా ఢీకొట్టింది. దీంతో ఆ వాహనాలు స్వల్పంగా డ్యామేజ్ అయ్యాయి. బైక్‌పై వెళ్తున్న భరతయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కంటైనర్ డ్రైవర్ రితేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని భరతయ్య మృతదేహాన్ని ఏరియా దవాఖానకు తరలించారు. టూటౌన్ సీఐ నాగార్జున కేసు నమోదు చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డీసీఎం, ఆటోను ఢీకొన్న కంటెయినర్